సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

శుక్రవారం | 20 | జనవరి | 2023



'ఐటీ హబ్'కు నిర్లక్ష్యపు వైరస్
వరంగల్‌ను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దుతామన్న పాలకుల హామీకి నిర్లక్ష్యమనే వైరస్ పట్టింది. ఓరుగల్లు మాత్రం నాలుగు కంపెనీలకే పరిమితమైంది. - 8లో▸



ఖమ్మం సభ గ్రాండ్ సక్సెస్
ఖమ్మంలో నిర్వహించిన భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ సభ గ్రాండ్ సక్సెస్ అయిందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం $32^0/18^0$
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రి సమయంలో చలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఫిబ్రవరి 11నుంచి టెక్నికల్ కోర్సు పరీక్షలు

భూపాలపల్లి అర్బన్: టెక్నికల్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు ఫిబ్రవరి 11నుంచి 14వ రకు వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి ముద్దమల్ల రాజేందర్, ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి బానోత్ జుమ్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డ్రాయింగ్ లోయర్ గ్రేడ్, హైయర్ గ్రేడ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్ మరియు హైయర్ గ్రేడ్ విద్యార్థులకు రెండు విడతల్లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షకు హాజరయ్యే వారు బీఎస్సీ.తెలంగాణ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

అనర్హులపై చర్యలు తీసుకోవాలి



భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని భాస్కర్‌గడ్డలో అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేపడుతున్న అనర్హులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. ఎస్ఎస్‌యూఐ నాయకులు గురువారం భూపాలపల్లి ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ మాట్లాడుతూ పట్టాలు లేకుండా విచ్చలవిడిగా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఇంటి నిర్మాణ అనుమతులు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలకు కూల్చేసి అర్హులైన నిరుపేదలకు పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, అనూప్, రాజు, తిలక్, నవీన్, గోపి, మహేందర్ పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేత



భూపాలపల్లి: అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు మంచినిల్ల లక్ష్మీనారాయణ కుటుంబానికి ఎస్పీ జె.సురేందర్‌రెడ్డి హోంగార్డు వెల్ఫేర్ ఫండ్ చెక్కును అందజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో లక్ష్మీనారాయణ ఇటీవల మృతిచెందాడు. దీంతో వెల్ఫేర్ ఫండ్‌తో పాటు తోటి హోం గార్డులు జమచేసిన రూ.70వేల చెక్కును గురువారం దివంగత లక్ష్మీనారాయణ సతీమణి రమకు ఎస్పీ అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ బండ సతీష్ పాల్గొన్నారు.

మండల ఇన్‌చార్జ్‌ల ఎన్నిక



భూపాలపల్లి రూరల్: మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) మండలాల ఇన్‌చార్జ్‌లను ఎన్నుకున్నట్లు ఆపార్టీ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి తెలిపారు. గురువారం జిల్లాకేంద్రంలోని సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో పార్టీ జిల్లా కన్వీనర్ గట్ల రాజన్న అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ మండలాల ఇన్‌చార్జ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అంబాల చంద్రమౌళి తెలిపారు. భూపాలపల్లి, గణపురం, రేగొండ-చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి, మహాముత్తారం-పలిమెల, మల్హర్, భూపాలపల్లి పట్టణ ఇన్‌చార్జ్‌లుగా నోముల శ్రీనివాస్, ఇంజంపల్లి ప్రవీణ్, గాజుల భిక్షపతి, గట్ల రాజన్న, అంబాల చంద్రమౌళి, మారసాక లచ్చయ్య, కేసారపు నరేష్, సురేష్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

మల్హర్: ఈనెల 22న నాగర్‌కర్నూల్‌లో జరిగే దళిత గిరిజన ఆత్మగౌరవ దండోర బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను తాడిచర్లలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. దళిత, గిరిజన వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దెదింపే వరకు కాంగ్రెస్ పార్టీ దళిత విభాగం పక్షాన పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మంత్రి రాజసమ్మయ్య, పార్టీ గ్రామ అధ్యక్షుడు కేసారపు చంద్రయ్య, ఉపసర్పంచ్ ఇందారపు చంద్రయ్య, ఎస్సీ విభాగం గ్రామ శాఖ అధ్యక్షుడు సమ్మయ్య పాల్గొన్నారు.

'ఆయిల్‌పామ్'తో ఆదాయం

30ఏళ్ల పాటు పంట దిగుబడి
- ఎకరాకు రూ.లక్షన్నర వరకు సంపాదన
- పంట సాగుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ
- అంతరపంటల సాగుతో మరింత లాభం
- రైతులకు అవగాహన దిశగా అధికారుల చర్యలు



ఆయిల్‌పామ్ సాగును పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సంజీవ్‌రావు (ఫైల్)

కాటారం: ఆధునిక వ్యవసాయంలో భాగంగా ఆధునిక పద్ధతుల వైపు రైతులు అడుగులు వేస్తున్నారు. దీర్ఘకాలిక పంటల సాగు దిశగా రైతులు దృష్టి సారిస్తున్నారు. పంట సాగులో పెట్టుబడి, సమయం ఆదా అవుతుండటంతో పాటు పలు దీర్ఘకాలిక పంటల సాగుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ అందిస్తుండటంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. దీర్ఘకాలిక పంటలు సాగుచేస్తే కలిగే లాభాలు, ప్రభుత్వాల ద్వారా అందే ప్రయోజనాలపై గతంలో రైతులకు పూర్తిగా అవగాహన లేకపోవడంతో ముందుకు సాగలేదు. ప్రస్తుతం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో సరైన రీతిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతూ రైతులను సాగుకు సమాయత్తం చేస్తున్నారు. రైతులు కొత్త అంశాల వైపు అడుగులు వేస్తే మెరుగైన ఫలితాలు, సౌకర్యాలు ఉంటాయని శాస్త్రవేత్తలు, అధికారులు చెబుతుండటంతో నమ్మకం కలుగుతోంది. దీర్ఘకాలిక పంటల్లో ప్రాముఖ్యమైన ఆయిల్‌పామ్ సాగుపై ఇటీవల అధికారులు గ్రామాల్లో విరివిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో పలువురు రైతులు ముందుకొచ్చి ఆయిల్‌పామ్ సాగు చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా సుమారు 1,850మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు కోసం ఉద్యానవన శాఖ ద్వారా ఇప్పటివరకు తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో సుమారు 1,650 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతున్నట్లు వారు పేర్కొన్నారు. జిల్లాలో మరో వెయ్యి మంది రైతులు సాగు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడానికి రైతులు ఇలాంటి దీర్ఘకాలిక పంటలు సాగుచేయాలని ఉద్యానవన శాఖ అధికారులు సూచిస్తున్నారు. దరఖాస్తు ప్రక్రియ, సబ్సిడీ, పంట సాగు సందేహాల కోసం అధికారులను సంప్రదించాలని కోరుతున్నారు.

నాలుగో సంవత్సరం నుంచి ఆదాయం..

ఆయిల్‌పామ్ సాగు చేసిన నాలుగో సంవత్సరం నుంచి 30ఏళ్ల వరకు పంట కాలం కొనసాగుతుండటంతో ఈ కాలంలో రైతులకు ఆదాయం సమకూరుతుంది. దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే సంబంధిత కంపెనీ వారు రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తారు. ఆయిల్‌పామ్ సాగులో చీడపీడ బెడద తక్కువగా ఉండటంతో పనిభారం తక్కువగా ఉండి రైతులకు శ్రమ, సమయం ఆదా అవుతుంది. ఎకరాకు లక్షన్నర వరకు బ్యాంక్ రుణం పొందే అవకాశం ఉంటుంది. ఆ రుణాన్ని తొమ్మిదేళ్ల వరకు తిరిగి చెల్లించవచ్చు.

ఉద్యానశాఖ రాయితీ..

ఎకరాకు 57మొక్కలు నాటాలి. ఒక మొక్క రూ.193 కాగా రాయితీ రూపంలో 20రూపాయలకే రైతులకు అందిస్తారు. నాలుగేళ్ల ఆయిల్‌పామ్ నిర్వహణ ఖర్చు అందజేస్తారు. మొదటి ఏడాది ఎకరాకు రూ.2100, అంతర పంటలు వేసిన రైతుకు రూ.4200, మిగితా మూడేళ్ల ఏటా రూ.4200 చొప్పున ఎన్ని ఎకరాల్లో పంట సాగుచేస్తే అంత మొత్తం సొమ్ము అందుతుంది. డ్రిప్ సేద్యం ద్వారా నీరు అందించడానికి కేటగిరీలను అనుసరించి 80నుంచి 100శాతం రాయితీ అందుతుందని అధికారులు తెలుపుతున్నారు.

అంతరపంటలు సాగు..

ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన నుంచి మూడేళ్ల తర్వాత దిగుబడి ప్రారంభమై 30 ఏళ్ల వరకు వస్తోంది. ఎకరానికి పది టన్నుల దిగుబడి వస్తుంది. ఎకరాకు లక్షన్నర వరకు రైతుకు ఆదాయం సమకూరుతుంది. కోతుల బెడద ఉండదు. అంతర పంటలు సాగు చేసుకోవచ్చు. మూడేళ్ల వరకు అన్ని రకాల కూరగాయలు, పల్లి, పెసరు, మినుము, మొక్కజొన్న సాగు చేసుకోవచ్చు. బాడర్ పంటలుగా శ్రీగంధం, మల్బరి, టేకు పంటలు వేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

దరఖాస్తు విధానం..

ఆయిల్‌పామ్ సాగు చేసుకోవాలని అనుకునే రైతులు ఉద్యానవన శాఖ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫారంతో పాటు భూమి డాక్యుమెంట్లు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, పట్టాదారు పాస్‌పుస్తకం, 1-బీ జిరాక్స్ పత్రాలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు అందజేయాల్సి ఉంటుంది.

సాగుతో దీర్ఘకాలిక లాభం



ఆయిల్‌పామ్ సాగుతో దీర్ఘకాలిక ఆదాయం ఉంటుంది. గతంలో నేను వరి సాగు చేస్తుంటిని. ఆశించిన స్థాయిలో పంట దిగుబడి లేక తీవ్రంగా నష్టపోయిన. ఆయిల్‌పామ్ గురించి అధికారుల ద్వారా తెలుసుకొని సాగుకు పూనుకున్న. రెండెకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న. ఆరుతడి పంట వేయడానికి సిద్ధమవుతున్న. రెండు రకాలుగా లబ్ధిపొందే అవకాశం ఉండటంతో పూర్తిగా ఆయిల్‌పామ్ సాగుపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నా.

- మంచాల శ్రీకాంత్, యువరైతు, రామకిష్టాపూర్

సాగుపై దృష్టి సారించాలి



రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి. వరి సాగుతో పోల్చుకుంటే సమానమైన పంట ఆయిల్‌పామ్ సాగు. దీర్ఘకాలికంగా దిగుబడి ఆదాయం రావడంతో పాటు నాలుగేళ్ల లోపు అంతరపంటలు సాగుచేసుకునే అవకాశం ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సబ్సిడీ అందుతుంది. రైతులకు అధిక శ్రమ, పెట్టుబడి నుంచి ఉపశమనం లభించడంతో పాటు స్థిర ఆదాయం చేకూరుతుంది. ప్రస్తుత పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగుపై రైతులు ఆసక్తి పెంచుకోవాలి. పూర్తి వివరాల కోసం ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలి.

- సంజీవ్‌రావు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి



ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు

బొమ్మల కొలువు..



డ్యాన్స్ చేస్తున్న సభ్యులు





హాజరైన మహిళలు

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని ఇల్లందు క్లబ్‌హౌజ్‌లో గురువారం సింగరేణి లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో బొమ్మల కొలువు ఘనంగా నిర్వహించారు. ఏరియా సింగరేణి సేవా అధ్యక్షురాలు బళ్లారి మాధవి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్యఅతిథులుగా సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్) చంద్రశేఖర్ సతీమణి పల్లవి హాజరై బొమ్మల కొలువును ప్రారంభించారు. ఈ సందర్భంగా సభ్యులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. క్లబ్ ఆవరణను బొమ్మలు, ముత్యాల ముగ్గులతో సంప్రదాయ పద్ధతిలో తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరి వాసతిప్రసాద్, సభ్యులు జయ, హైమ, మణి పాల్గొన్నారు.

ప్రాచీన దేవాలయాలను అభివృద్ధి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

భూపాలపల్లి: జిల్లాలోని ప్రాచీన దేవాలయాలను అభివృద్ధి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సూచించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో దేవాదాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఉన్న ప్రాచీన దేవాలయాలు, నూతనంగా నిర్మాణంలో ఉన్న ఆలయాల పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ కొత్త హరిబాబు, స్థపతి వల్లి నయంగం, దేవాదాయశాఖ ఎస్ఈ మల్లికార్జున్‌రెడ్డి, శిల్పి వెంకటేష్ పాల్గొన్నారు.

యువకులు క్రీడల్లోనూ ముందుండాలి

జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి



బహుమతులు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

మహాముత్తారం: యువకులు విద్యలోనే కాకుండా క్రీడారంగంలోనూ ముందుండాలని జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి అన్నారు. మండలంలోని పెగడపల్లి గ్రామంలో పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ క్రీడల ముగింపు సమావేశానికి గురువారం ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి 8వేలు, రెండో బహుమతి 5వేలు, మూడో బహుమతి 3వేలతో పాటు షీల్డ్‌లను అందజేశారు. అనంతరం శ్రీహర్షిణి మాట్లాడుతూ క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు స్నేహాభావం పెరుగుతుందన్నారు. అనంతరం జెడ్పీచైర్మన్‌ను క్రీడాకారులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు, సర్పంచ్ కొర్ర వినోద జగపతినాయక్, ఎంపీటీసీ వసంత రూపానాయక్, యూత్ అధ్యక్షుడు జేపాల్ నాయక్, అజ్మీరా సుజాత, బాలాజీనాయక్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌భాస్కర్

టేకుమట్ల(రేగొండ): ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌భాస్కర్ అన్నారు. గురువారం రేగొండ మండలకేంద్రంతో పాటు, మండలంలోని రేపాక రైతు వేదికలలో ఉద్యాన, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందేందుకు ఆయిల్ పామ్ అనువైన పంట అన్నారు. ఇతర పంటలతో పోల్చితే ఆయిల్ పామ్ పంటతో ఎక్కువ లాభాలు పొందవచ్చని చెప్పారు. అందుకు ప్రభుత్వం సబ్సిడీలను సైతం అందిస్తుందని తెలిపారు. నీటి సౌకర్యం కలిగి ఉన్న రైతులు ఆయిల్ పామ్ పంటను సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి సునీల్‌కుమార్, మండల వ్యవసాయాధికారి వాసుదేవరెడ్డి, రైతుబంధు సమితి మండల కో ఆర్డినేటర్ మటిక సంతోష్, ఆయిల్ ఫాం కంపెనీ ప్రతినిధులు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల రైతులను ఆదుకోవాలి



ధర్నాలో మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు

భూపాలపల్లి: కాళేశ్వరం ప్రాజెక్టు కింద ముంపునకు గురవుతున్న గ్రామాల రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, లేనిపక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని మాజీ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ముంపు రైతులకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ప్రధాన గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌజ్ కింద వందలాది ఎకరాలు నీటిలో మునుగుతున్నాయని అన్నారు. నాలుగేళ్లుగా రైతులు నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. డీసీసీ అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి, కాంగ్రెస్ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యాక్ వాటర్ ద్వారా 13 గ్రామాలకు చెందిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం కలెక్టర్ భవేష్‌మిశ్రాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బట్టు కర్ణాకర్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు' షురూ

- 25కేంద్రాల్లో ప్రారంభం
- తొలిరోజు 3,875మందికి పరీక్షలు

భూపాలపల్లి అర్బన్: జిల్లావ్యాప్తంగా కంటి వెలుగు పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 25కేంద్రాల్లో శిబిరాలు ప్రారంభం కాగా.. తొలిరోజు 3,875మందికి వైద్యాధికారులు పరీక్షలు చేశారు. 1,022 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు.

భూపాలపల్లి మున్సిపాలిటీతో పాటు అన్ని మండలకేంద్రాల్లో 13 పీహెచ్‌సీల పరిధిలో 25 కంటి వెలుగు కేంద్రాలను అధికారులు ఏర్పాటుచేశారు. గణపురం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన కంటివెలుగు కేంద్రాన్ని కలెక్టర్ భవేష్‌మిశ్రాతో కలిసి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రారంభించారు. కాటారం మండల కేంద్రంలో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్దు ప్రారంభించారు. తొలిరోజు జిల్లావ్యాప్తంగా కంటి పరీక్షలకు 4,078 మంది హాజరయ్యారు. 3,875వేల మందికి కంటి పరీక్షలకు నిర్వహించారు. అందులో 1,022 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 825 మందికి కంటి అద్దాల కోసం ఆన్‌లైన్‌లో ఆర్డర్‌చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీరామ్ తెలిపారు.

పకడ్బందీ ఏర్పాట్లు

కంటి వెలుగు కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్ భవేష్‌మిశ్రా, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీరామ్, డీపీఓ ఆశాలత, మున్సిపల్ కమిషనర్ అవినాష్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు కల్పించారు. కేంద్రాల్లోని సిబ్బందికి, పరీక్షల కోసం వచ్చే వారికి టెంట్లు, కుర్చీలు, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పోలీస్ సిబ్బందిని కేటాయించారు.



కంటి పరీక్షలు చేసుకుంటున్న ఎమ్మెల్యే

ఆపరేషన్ ఇప్పటికి దిక్కు లేదు..



నా పేరు పెండ్యాల రాజయ్య. మాది కాటారం. నా వయస్సు 74 ఏళ్లు. నాకు కంటి అవస్త బాగా ఉన్నది. కళ్లు సరిగా కనబడుత లేవు. ప్రభుత్వం గతంలో నిర్వహించిన కంటి వెలుగులో పరీక్షలు చేయించుకున్న. నీకు కళ్లద్దాలు పని చేయవు ఆపరేషన్ చేయించుకోవాలని డాక్టర్లు చెప్పింన్రు. నిన్ను నాలుగు రోజులయ్యాక ఆపరేషన్‌కు తీసుకుపోతం అన్నారు. ఇగ గవర్నమెంటు డాక్టర్లు అచ్చి ఆపరేషన్‌కు తీసుకుపోతరని చూసిన.. ఇప్పటికీ దిక్కు లేదు. ప్రైవేట్‌లో చేయించుకుందామంటే నా దగ్గర అన్ని పైసలు లేక ఊరుకున్న. కళ్లు అగపడి అగపడక కాలం ఎళ్లదీస్తున్న. ఇప్పుడు మళ్ల గవర్నమెంట దవాఖానాలో కంటి పరీక్షలు చేస్తున్నారంటే అచ్చిన. ఇప్పుడు ఆపరేషన్ చేసే వయస్సు కాదని అంటున్నారు. ఇగ అద్దాలు ఇస్తే తీసుకొని పోతా అని చూస్తున్నా.

ఎమ్మెల్యే గండ్రకు కళ్లద్దాలు..

గణపురం మండల కేంద్రంలో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఎమ్మెల్యేకు 2.0 పాయింట్ల దృష్టిలోపం ఉన్నట్లు నేత్రవైద్యులు గుర్తించారు. కలెక్టర్ భవేష్‌మిశ్రా సమీక్షంలోనే వైద్యాధికారులు కంటి అద్దాలను పంపిణీ చేశారు.



కంటి అద్దాలు పెట్టుకుంటున్న ఎమ్మెల్యే


దేశానికే ఆదర్శం

గణపురం: కంటి వెలుగు కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. గణపురం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో గురువారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. సర్పంచ్ నారగాని దేవేందర్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇంతటి గొప్ప అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దివాకర, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, మండల ప్రత్యేక అధికారి పురుషోత్తం, తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంపీడీఓ అరుంధతి, ఎంపీపీ కావటి రజిత, ఎంపీటీసీలు మోటపోతుల శివశంకర్ గౌడ్, మంద అశోక్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలసాని లక్ష్మీనరసింహారావు పాల్గొన్నారు.



వృద్ధురాలికి అద్దాలు తొడుగుతున్న ఎమ్మెల్యే

పరీక్షలు చేయకుండానే అద్దాలు ఇచ్చారు..



2018 సంవత్సరంలో మొదటిసారి కంటివెలుగు పరీక్షలు చేసే కేంద్రానికి వెళ్లిన. అప్పుడు పరీక్షలు చేయకుండానే కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఇంటికి వెళ్లి వాటిని పెట్టుకోగానే కండ్లు తిరిగి తల నొప్పి ప్రారంభమైంది. దీంతో అద్దాలను పక్కన పెట్టిన. రెండో విడత ప్రభుత్వం ప్రచారం ఎక్కువగా చేస్తుండటంతో కంటి వెలుగులో మళ్లీ పరీక్షలు చేసుకోవడానికి వచ్చిన.

- గుంట బీరయ్య, కాశీంపల్లి

ఉద్యోగులనూ పంపే యోచన! | డిమాండ్‌కు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి | సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యం - వివరాలు 10లో▸

క్లుప్తంగా

టేకు కలపతో భార్య ప్రతిమ


టేకు కలపతో రూపొందించిన పకిరిబాయి ప్రతిమ

కురవి: చనిపోయిన భార్యకు గుర్తుగా ఆమె విగ్రహం తయారు చేయించడం చూస్తుంటాం. కానీ టేకు కలపతో భార్య ప్రతిమ చేయించాడు ఓ భర్త. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కొత్తూరు(జీ) శివారు తాట్యతండాకు చెందిన జాటోత్ వాల్య.. భార్య పకిరిబాయి గత ఏడాది చనిపోయింది. ఆమెపై ఉన్న ప్రేమకు గుర్తుగా భర్త.. పకిరిబాయి ప్రతిమను టేకు కలపతో చేయించాడు. ఎడ్లబండిలో ఉన్నట్లు చెక్కించి ఇంట్లో ప్రతిష్ఠించాడు. కాగా, గురువారం వాల్యను మంత్రి సత్యవతి రాథోడ్ పరామర్శించి పకిరిబాయి ప్రతిమను ఆసక్తిగా తిలకించారు.

కొడుకుతో గొడవ పడి తల్లి ఆత్మహత్య

హసన్‌పర్తి: కొడుకుతో గొడవ పడి తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. హసన్‌పర్తికి చెందిన పెద్దమ్మ సాంబలక్ష్మి(65)కి ఇద్దరు కుమారులు రవి, గణేష్ ఉన్నారు. సాంబలక్ష్మి పెద్ద కుమారుడు రవి వద్ద ఉంటుంది. గణేష్ అద్దె ఇంటిలో ఉంటున్నాడు. బుధవారం రాత్రి పెద్ద కుమారుడు రవి, తల్లి సాంబలక్ష్మికి మధ్య గొడవ జరిగింది. దీంతో మానసిక వేదనకు గురైన సాంబలక్ష్మి బాత్‌రూంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతురాలి చిన్న కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపారు.

9మందిపై చీటింగ్ కేసు నమోదు

ఖిలా వరంగల్: వాహనాల నంబర్ ప్లేట్లపై స్టిక్కర్ అతికించి, నంబర్లు కనిపించకుండా ట్యాంపరింగ్‌కు పాల్పడిన తొమ్మిది మంది వాహనదారులపై చీటింగ్ కేసు నమోదు చేసి మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు ట్రాఫిక్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. శంభునిపేట గవిచర్ల క్రాస్ రోడ్డు జంక్షన్‌లో ఎస్సైలు రాజబాబు, డేవిడ్, ఆర్ఎస్సైలు పూర్ణచందర్ రెడ్డి, శ్రవన్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

'ఐటీ హబ్'కు నిర్లక్ష్యపు వైరస్

- 2013లోనే ఏర్పాటుకు అడుగులు
- 2017లో మొదటి కంపెనీ ప్రారంభం
- ఆరేళ్లలో వచ్చినవి నాలుగు కంపెనీలే..
- మౌలిక వసతుల లేమితో ముందుకు రాని కంపెనీలు



హన్మకొండ చౌరస్తా: వరంగల్‌ను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దుతామన్న పాలకుల హామీకి నిర్లక్ష్యమనే వైరస్ పట్టింది. 1400పైగా ఐటీ కంపెనీలతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ విరాజిల్లుతుంటే.. అంతే చరిత్ర కలిగి రాష్ట్ర రెండో రాజధానిగా చెప్పుకుంటున్న ఓరుగల్లు నగరం మాత్రం కేవలం నాలుగు కంపెనీలకే పరిమితమైంది. కంపెనీలు రాకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో పురోగతి లేకపోవడమే కారణం. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తేనే ఐటీకి కేరాఫ్‌గా వరంగల్ మారుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇక స్వస్థలంలో సరైన అవకాశాలు లేక వరంగల్‌కు చెందిన వేల మంది యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు హైదరాబాద్, ముంబాయి, బెంగళూరు వంటి నగరాలకు వలస వెళ్తున్నారు. వరంగల్‌లో ఐటీ కంపెనీలు, స్టార్టప్ కంపెనీల పరిస్థితిపై సాక్షి ప్రత్యేక కథనం.

2013లోనే అడుగులు..

వరంగల్‌కు ఐటీ రంగాన్ని తీసుకురావాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి మంత్రి పొన్నాల లక్ష్మయ్య కాంక్షించారు. నగర శివారులోని మడికొండ ప్రాంతంలో ఐటీ కంపెనీలు స్థాపించేందుకు 2013లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశారు. దీంతో ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ 2014లో 40 ఎకరాల స్థలాన్ని ఐటీ హబ్‌కు అనువుగా గుర్తించింది. అదే సమయంలో మరో 100 ఎకరాలు అవసరమని ప్రభుత్వాన్ని కోరారు. ఇంతలోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించడం, ప్రభుత్వాలు మారడంతో ప్రతిపాదనలు మూలకుపడ్డాయి.

2017లో మొదటి కంపెనీ..

2014లో ఐటీ పార్కుకు అడుగులు పడగా మూడేళ్ల సుదీర్ఘ కాలం తర్వాత 2017 జనవరి 22న మొదటి ఐటీ కంపెనీ సీయెంట్ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభమైంది. నాలుగెకరాల స్థలంలో కొనసాగుతున్న ఈ కంపెనీలో ప్రస్తుతం 250 వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. డిజిటల్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, టెలీ కమ్యూనికేషన్ సేవలను సీయెంట్ కంపెనీ అందిస్తోంది.

మౌలిక వసతులు కల్పిస్తేనే..

కొత్త కంపెనీలు ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణం మౌలిక వసతులు లేకపోవడం. పార్కులో రోడ్లు, డ్రైనేజీ, నీటి వనరులు లేకపోవడం వల్లే కొత్త కంపెనీలు ఆసక్తి చూపడం లేదని నిపుణులు చెబుతున్నారు. దీనికితోడు మొదట్లో గజానికి రూ.700 ధర నిర్ణయించిన ప్రభుత్వం ప్రస్తుతం రూ.2000 చొప్పున వసూలు చేస్తూ కేవలం 30 ఏళ్ల లీజు నిబంధన పెట్టింది. దీంతో కంపెనీలు వెనుకడుగు వేస్తున్నాయని నిపుణులు అంటున్నారు.

ఆరేళ్లలో వచ్చినవి నాలుగే..

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ నగరాన్ని తీర్చిదిద్దుతామని చెప్పిన పాలకులు చేతల్లో విఫలమయ్యారనే విమర్శలు ఘాటుగా వినిపిస్తున్నాయి. గడిచిన ఆరేళ్లలో నగరానికి కేవలం మూడు ఐటీ కంపెనీలే వచ్చాయి. అందులో ఒకటి సీయెంట్ కాగా వెంటాయిస్, కాకతీయ టెక్నాలజీ కంపెనీలతో పాటు టెక్ మహీంద్ర కంపెనీ మడికొండ ఐటీ పార్కులో నిర్మాణంలో ఉన్న ఇంక్యుబేషన్ టవర్‌లో కొనసాగుతుంది. వీటి తర్వాత ఏ ఒక్క కార్పొరేట్ ఐటీ కంపెనీ కూడా వరంగల్‌లో ఏర్పాటు చేసేందుకు సుముఖత చూపలేదు.

వరంగల్‌పై సవతి తల్లి ప్రేమ..



"త్వరలో వరంగల్ నగరానికి ఐటీ దిగ్గజ కంపెనీలు వస్తాయని వేదికలపై ఐటీశాఖ మంత్రి కేటీఆర్ చెప్పిన వ్యాఖ్యలు మాటలకే పరిమితమయ్యాయి. వరంగల్‌పై కేసీఆర్ సర్కార్‌ది కేవలం సవతి తల్లి ప్రేమే అని తేలిపోయింది. అందుకు నగరంలో నడుస్తున్న నాలుగు కంపెనీలే ఉదాహరణ. కేసీఆర్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఐటీ పార్కులో వసతులు కల్పించి కొత్త కంపెనీలను తీసుకురావాలి.

– పుల్లూరు సుధాకర్, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు

ఇంక్యుబేషన్, మెంటర్స్ సౌకర్యం కల్పించాలి



వరంగల్ నగరంలో 30 నుంచి 40 వరకు స్టార్టప్ కంపెనీలు ఉన్నాయి. వాటికి ప్రభుత్వం తరఫున ఇంక్యుబేషన్, మెంటర్స్ సౌకర్యం కల్పించాలి. జీఎస్‌టీలో రీయింబర్స్‌మెంట్, రాయితీపై రుణాలు, ఐటీ పార్కు లీజు కాలాన్ని మరింత పెంచి ధరను తగ్గించి స్టార్టప్ కంపెనీలకు ఇవ్వాలి. ప్రభుత్వ ప్రాజెక్టులలో స్టార్టప్ కంపెనీలను భాగస్వామ్యం చేయాలి.

– ఆడెపు వెంకటేశ్, ఎస్‌వీ యాప్స్ సాఫ్ట్ సొల్యూషన్స్ చైర్మన్, హనుమకొండ

వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ


వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

ఖానాపురం: వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామ సమీపంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలోకి బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించారు. హుండీ తాళాన్ని తొలగించి పక్కనే ఉన్న చెరువు కట్టపైకి తీసుకెళ్లారు. అక్కడ గొడ్డలి సాయంతో హుండీని పగలగొట్టి అందులో ఉన్న నగదును అపహరించుకుపోయారు. గురువారం ఉదయం ఆలయంలోకి వెళ్లిన అర్చకులు హుండీ చోరీకి గురైనట్లు గమనించారు. పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై తిరుపతి చేరుకొని క్లూస్‌టీంకు సమాచారం ఇచ్చారు. క్లూస్‌టీం ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో సిబ్బంది చేరుకుని హుండీ, గొడ్డలిపై ఉన్న వేలిముద్రలు సేకరించారు. జాగిలంతో ఆలయ ప్రాంగణంతో పాటు చెరువు కట్టపై వెతికారు. కాగా, పక్కనే ఆలయ నిర్మాణ పనులు చేస్తున్న వారు బయటకు రాకుండా దొంగలు బయటి నుంచి గొళ్లెం పెట్టారు. ఆలయ కమిటీ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో రెండుసార్లు ఇదే ఆలయంలో హుండీ చోరీకి గురైంది.

ఆర్టీసీ బస్సు ఢీకొని కానిస్టేబుల్ మృతి

- ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా నరేష్ విధులు
- ఎస్సై ఈవెంట్స్‌లో ఉత్తీర్ణత, అంతలోనే విషాదం


నరేష్ (ఫైల్)

నడికూడ: రోడ్డు ప్రమాదంలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన హనుమకొండ జిల్లా నడికూడ మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పరకాల పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం శనిగరం గ్రామానికి చెందిన బండి నరేష్(28)ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్ జిల్లాలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. నెల రోజుల క్రితం ఎస్సై ఈవెంట్స్ కోసం సెలవుపై గ్రామానికి వచ్చాడు. ఎస్సై ఈవెంట్స్‌లో ఉత్తీర్ణత కూడా సాధించాడు. గురువారం బైక్‌పై వెళ్లి చర్లపల్లిలోని బంధువులను కలిశాడు. అక్కడ నుంచి పులిగిల్లలో బంధువుల ఇంటికి వెళ్లే క్రమంలో పరకాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు చర్లపల్లి గ్రామ శివారులో బైక్‌ను ఢీకొట్టింది. దీంతో నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పరకాల పోలీసులు తెలిపారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నరేష్ తల్లిని ఓదార్చారు.

విద్యుత్‌షాక్‌తో రైతు..


మల్లయ్య మృతదేహం

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బస్వరాజుపల్లి గ్రామానికి చెందిన అంబటి మల్లయ్య(60) అనే రైతు తన వ్యవసాయ క్షేత్రంలో విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. రవినగర్ శివారు మంగళికుంట సమీపంలో మల్లయ్యకు ఎకరం పొలం ఉంది. గురువారం పని నిమిత్తం వెళ్లాడు. ఈ క్రమంలో పొలంలో ఉన్న బోరు మోటార్ తీగ తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

స్టార్టర్ ఆన్ చేస్తూ మరొకరు..


రవి మృతదేహం

కురవి: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కొత్తూరు(జీ) శివారు బంచరాయితండాలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. బంచరాయితండాకు చెందిన బానోత్ రవి(40) అనే రైతు అదే గ్రామానికి చెందిన నారాయణ అనే రైతు పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. గురువారం ఏటి ఒడ్డున ఉన్న పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. మోటార్ స్టార్టర్ ఆన్ చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో కింద పడి కొట్టుకుంటుండగా పక్క పొలం రైతులు, తండావాసులు గమనించి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న రవిని వెంటనే మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య రాజేశ్వరి, కొడుకు, కుమార్తె ఉన్నారు. ఈ విషయమై ఎస్సై బి.రామును వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చెరువులో పడి మహిళ..

మంగపేట: ములుగు జిల్లా మంగపేట మండలం బాలన్నగూడెం గ్రామానికి చెందిన చెరుకుల సూరమ్మ(52) గ్రామ సమీపంలోని పెద్దచెరువులో పడి మృతి చెందింది. ఏఎస్సై అబ్బయ్య కథనం ప్రకారం.. కొంతకాలంగా సూరమ్మ మతిస్థిమితం సరిగా లేనట్లు ప్రవర్తిస్తోంది. ఈ నెల 16న ఇంటి నుంచి బయటకి వెళ్లి తిరిగి రాలేదు. గతంలో ఇంటి నుంచి వెళ్లి తెలిసిన వారు, బంధువుల ఇళ్లలో ఉండి కొద్ది రోజుల తర్వాత తిరిగి వచ్చేది. దీంతో ఎక్కడో ఓ చోట ఉండి ఉంటుందని కుటుంబ సభ్యులు భావించారు. కాగా, తిమ్మంపేటకు చెందిన రైతు గుండు నర్సయ్య గురువారం చెరువు వద్దకు వెళ్లగా నీటిలో మహిళ మృతదేహం కనిపించింది. విషయాన్ని బాలన్నగూడెం గ్రామస్తులకు తెలియజేశాడు. గ్రామస్తులు చేరుకుని సూరమ్మ మృతదేహంగా గుర్తించారు. మృతురాలి భర్త లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

మిర్చి కల్లంలో కూలీగా..



వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి గురువారం శాయంపేట మండల కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భూపాలపల్లికి వెళ్తున్న క్రమంలో రేగొండ మండలంలోని గోరికొత్తపల్లి–నిజాంపల్లి శివారులో మిర్చి ఏరుతున్న కూలీలను చూసి వాహనాన్ని ఆపారు. కూలీలతో కలిసి కొంతసేపు తాలు మిర్చి ఏరి మహిళా కూలీల బాగోగులు తెలుసుకున్నారు.

– టేకుమట్ల(రేగొండ)

ఖమ్మం సభ గ్రాండ్ సక్సెస్

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


విలేకరులతో మాట్లాడుతున్నమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చిత్రంలో ఎంపీ దయాకర్, ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, అరూరి రమేశ్, నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

హన్మకొండ: ఖమ్మంలో నిర్వహించిన భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ సభ గ్రాండ్ సక్సెస్ అయిందని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. 5 లక్షల మంది ప్రజలు వస్తారని అంచనా వేసుకుంటే 6 లక్షలకు పైగా వచ్చారని, నాలుగు గంటలు వేచిఉండి సీఎం కేసీఆర్, వచ్చిన అతిథిలు ప్రసంగాలు ఓపికగా విన్నారని, సభాస్థలి బయట లక్షన్నర మంది ఉండిపోయారన్నారు. సభకు తరలివచ్చిన విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం హనుమకొండ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశమంతా సీఎం కేసీఆర్ వైపు చూస్తుందని, తెలంగాణలో అమలవుతున్న పథకాలు దేశ వ్యాప్తంగా అమలు చేయాలని కోరుకుంటున్నారన్నారు. మిషన్ భగీరథ పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ సభను చూసి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిచ్చి కూతలు కూస్తున్నారని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ బుద్ధి లేకుండా మాట్లాడుతున్నారని, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడని తూర్పారబట్టారు. ముందుగా కాంగ్రెస్ పార్టీని కాపాడుకోవాలని రేవంత్‌రెడ్డికి సూచించారు. చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ బీజేపీ నాయకులు కంటి వెలుగులో పరీక్షలు చేయించుకుని అద్దాలు పెట్టుకుని చూస్తే ఇక్కడి అభివృద్ధి, సంక్షేమ పథకాలు కనిపిస్తాయన్నారు. బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆరూరి రమేష్ మాట్లాడుతూ ఖమ్మం బీఆర్ఎస్ సభ కొత్త చరిత్రకు నాంది అని అన్నారు. సమావేశంలో ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, కుడా చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజు యాదవ్, మేయర్ గుండు సుధారాణి, నాయకులు లలితా యాదవ్, గాంధీ నాయక్, యాకూబ్ రెడ్డి పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో గొర్రెల మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

వర్ధన్నపేట: వీధి కుక్కల దాడిలో 7 గొర్రెలు మృతి చెందాయి. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం చెన్నారంలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితుడు అమరాజు స్వామి కథనం ప్రకారం.. చెన్నారం గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి ఎమ్మెల్యే అరూరి రమేష్ హాజరు కాగా, అమరాజు స్వామి కుటుంబ సభ్యులు పాల్గొని ఇంటికి వెళ్తున్నారు. అదే సమయంలో వీధి కుక్కలు వెంట పడడంతో పరిగెత్తి ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న గొర్రెల షెడ్డులోకి వెళ్లిన వీధి కుక్కలు గొర్రెలపై దాడి చేయడంతో 7 మృతి చెందాయి. దీంతో రూ.60 వేల నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయాడు. గ్రామంలో కుక్కల బెడద ఉందని పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని, ప్రభుత్వం తరఫున ఆర్థికసాయం అందించాలని కోరాడు.

ధర్మకర్తల మండలి నియామక జీఓ సస్పెన్షన్

- 11న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు
- కోర్టు వెబ్‌సైట్‌లో ఉత్తర్వులు

ఐనవోలు: ఐనవోలు ఆలయ ధర్మకర్తల మండలి నియామక ఉత్తర్వుల జీఓ నంబర్ 11ను సస్పెన్షన్ చేస్తూ ఈ నెల 11న హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, హైకోర్టుకు సెలవులు ఉండడంతో ఉత్తర్వుల ప్రతులు బుధవారం రాత్రి హైకోర్టు వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వచ్చాయి. కాగా, ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయ ట్రస్టు బోర్డు నియామకానికి డిసెంబర్ 15న నోటిఫికేషన్ వెలువడింది. 20 రోజులపాటు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. జనవరి 5తో గడువు ముగియడంతో ఈ నెల 10న ఎండోమెంట్ కమిషనర్ 14 మంది సభ్యులు, ఒక ఎక్స్‌అఫిషియో మెంబర్‌తో నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో హనుమకొండకు చెందిన పైల శ్రీనివాసులు అనే వ్యక్తి నియమ నిబంధనలు పాటించకుండా ఎండోమెంట్ కమిషనర్ జీఓ 11 వెలువరించారని, జీఓను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించాడు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఈ నెల 11న జీఓను సస్పెన్షన్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతివాదులు ఫిబ్రవరి 8 వరకు కౌంటర్ దాఖలు చేసుకునే అవకాశం ఉంది.

గంజాయి ముఠా గుట్టురట్టు

- ఆరుగురి నిందితుల అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి

మహదేవపూర్: ఛత్తీస్‌గఢ్ నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు గంజాయి తరలిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి గురువారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 12న కాళేశ్వరం అంతర్రాష్ట్ర బ్రిడ్జి వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో పల్సర్ బైక్ వచ్చిన షారుక్‌ఖాన్, మారెపల్లి మల్లేష్ అనుమానాస్పదంగా కనిపించడంతో సోదాలు చేశారు. వారి వద్ద 1,300 గ్రాముల గంజాయి లభించింది. నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టుకు తీసుకెళ్తున్న క్రమంలో జిల్లా కేంద్రానికి చేరుకోగానే షారుక్‌ఖాన్ పోలీసులను నెట్టివేసి పరారయ్యాడు. దీంతో ఎస్పీ సురేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈనెల 18న పలిమెల మండలంలో వాహనాల తనిఖీ చేస్తుండగా షారుక్‌ఖాన్‌తో పాటు పేరుక రాజకుమార్, సడల సురేందర్, జన్నే రాజశేఖర్, ఆముదాల కార్తీక్ గంజాయితో పట్టుబడ్డారు. విచారణలో ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌కు చెందిన చాందినీఖాన్ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తేలింది. దీంతో పోలీసులు ఆమె వద్ద సుమారు 2 కేజీల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు భూపాలపల్లిలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ఎండి షారుక్‌ఖాన్, గణపురం మండలం చెల్పూర్‌కు చెందిన ఆముదాల కార్తీక్, పేరుక రాజకుమార్, కొంపల్లికి చెందిన సడల సురేందర్, గొర్లవీడుకు చెందిన జన్నే రాజశేఖర్, బీజాపూర్‌కు చెందిన చాందినీ ఖాన్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఎస్సైలు లక్ష్మణ్‌రావు, అరుణ్, రాజ్‌కుమార్, ఏఎస్సైలు మల్లేశ్వర్, నాగయ్య, పీసీలు బాల్‌సింగ్, కిరణ్, సంతోష్, ధనుంజయ్, సమ్మయ్య, దేవేందర్, శ్యామ్, తిరుపతి, అన్వేష్, వేణు, లావణ్య, శిరీష, స్వాతిలను డీఎస్పీ అభినందించారు.

జీపీ స్థల విషయంలో ఇరువర్గాల ఘర్షణ

- కత్తులతో దాడి.. ఇద్దరికి గాయాలు
- బుర్రకాయలగూడెంలో ఘటన



గాయపడిన నాను, రవీందర్

గణపురం: నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఓ వర్గం వారు మరో వర్గంపై కత్తులతో దాడి చేయడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుర్రకాయలగూడెంలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై అభినవ్ కథనం ప్రకారం.. బుర్రకాయలగూడెం జీపీ భవన నిర్మాణం కోసం తహసీల్దార్ సతీష్‌కుమార్ 10 గుంటల భూమి కేటాయించారు. భవన నిర్మాణాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శుక్రవారం(నేడు) ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో గురువారం శిలాఫలకం పనులు చేస్తుండగా స్థలం తమదంటూ ఎంపీటీసీ కాలియా సాగర్, ప్రవీణ్, శ్రీబాబు, కాలియా గోపాల్ అడ్డుకున్నారు. పనులు చేయిస్తున్న తుమ్మల నాను, తుమ్మల రవీందర్‌తో గొడవకు దిగి కత్తులతో దాడి చేశారు. దీంతో నాను, రవీందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను 108 వాహనంలో భూపాలపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని తహసీల్దార్, ఎస్సై పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అజాగ్రత్తగా వాహనం నడిపిన వ్యక్తిపై కేసు

చెన్నారావుపేట: అజాగ్రత్తగా వాహనం నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ద్వారకపేటకు చెందిన గోపగాని సాయిచరణ్ ఈ నెల 15న తన పల్సర్ బైక్‌పై చెన్నారావుపేట మండల కేంద్రంలోని నంబర్ వన్ కాలనీలో గల అత్తగారింటి నుంచి నర్సంపేటకు వెళ్తున్నాడు. పార్క్‌లైన్ వైన్ షాపు వద్దకు రాగానే నర్సంపేటకు చెందిన గ్యార శ్రీకాంత్ తన ఎర్టిగా వాహనంతో వేగంగా దూసుకొచ్చి అకస్మాత్తుగా రోడ్డుపై ఆపాడు. దీంతో పల్సర్ బండిపై వస్తున్న సాయిచరణ్ కారును ఢీకొట్టి కిందపడిపోయాడు. అతడికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు అజాగ్రత్తగా వాహనం నడిపిన శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.